క్లుప్తంగా

అనుమానాస్పదంగా వ్యక్తి మృతి


మోహన్‌రెడ్డి (ఫైల్)

ఝరాసంగం(జహీరాబాద్): అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందిన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసుల తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని సిద్దాపూర్ గ్రామానికి చెందిన కె.మోహన్‌రెడ్డి(45) ఝరాసంగంలోని ఓ ఇంట్లో శవమై కనిపించాడు. విషయం తెలుసుకున్న జహీరాబాద్ రూరల్ సీఐ వెంకటేష్, ఎస్‌ఐ రాజేందర్‌రెడ్డి, క్లూస్ టీం సభ్యులు సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. హత్యా, ఆత్మహత్యా అనే కోణంలో కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తామని పోలీసులు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జహీరాబాద్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతికి సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

గ్యాస్ రీఫిల్లింగ్ గోదాంపై దాడులు


స్వాధీనం చేసుకున్న సిలిండర్లు

పటాన్‌చెరు టౌన్: గ్యాస్ రీఫిల్లింగ్ గోదాంపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించిన సంఘటన పటాన్‌చెరు మండల పరిధిలోని రుద్రారంలో చోటుచేసుకుంది. టాస్క్‌ఫోర్స్ ఎస్‌ఐ సాయిలు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామంలో సైకిల్ టాక్సీ వెనకాల అక్రమ గ్యాస్ ఫిల్లింగ్ చేస్తున్నారని సమాచారం తెలుసుకున్న పోలీసులు శుక్రవారం దాడులు నిర్వహించారు. దాడుల్లో గ్రామానికి చెందిన సోదరులు లతీఫ్, రషీద్ నుంచి 14 చిన్న గ్యాస్, 5 డొమెస్టిక్ ఖాళీ, నాలుగు డొమెస్టిక్ ఫుల్ సిలిండర్లతో పాటు మూడు వేయింగ్ మిషన్లు, రీఫీలింగ్ పైపులను స్వాధీనం చేసుకున్నారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

పటాన్‌చెరు టౌన్: ఆరు లీటర్ల మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్న సంఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం అమీన్‌పూర్ మండల పరిధిలోని పటేల్‌గూడ సృజన లక్ష్మీనగర్ ఫేస్–2లోని కిరాణాషాప్‌లో మద్యం విక్రయిస్తున్నారని విశ్వసనీయ సమాచారం మేరకు శుక్రవారం ఎస్‌ఐ మల్లయ్య సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ఆరు లీటర్ల మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

కొనుగోలు కేంద్రం ప్రారంభం


కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సీఈఓ శ్రీధర్‌రెడ్డి

కంది(సంగారెడ్డి): మండల కేంద్రంలోని పీఏసీఎస్‌లో వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సీఈఓ శ్రీధర్‌రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు దళారులను ఆశ్రయించకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలని సూచించారు. కార్యక్రమంలో ఏవో సారిక, ఏఈఓలు పాల్గొన్నారు.

హత్నూర మండలంలో...

హత్నూర(సంగారెడ్డి): మండల పరిధిలోని చింతల్ చెరువు, సాధుల్‌నగర్ గ్రామాల్లో శుక్రవారం ధాన్యం కొనుగోలు కేంద్రాలను సొసైటీ సీఈవో శ్రీనివాస్ ప్రారంభించారు. కార్యక్రమంలో ఏఈఓ వరప్రతాప్, రైతులు, నాయకులు పాల్గొన్నారు.

స్వెటర్లు పంపిణీ


పారిశుధ్య కార్మికులకు స్వెటర్లు పంపిణీ చేస్తున్న రాములు కుటుంబ సభ్యులు

హత్నూర(సంగారెడ్డి): హత్నూర గ్రామానికి చెందిన ఆర్మీ రిటైర్డ్ ఆఫీసర్ దివంగత ఆకుల రాములు వర్ధంతిని పురస్కరించుకొని వారి కుటుంబ సభ్యులు గ్రామానికి చెందిన పారిశుధ్య కార్మికులకు శుక్రవారం స్వెటర్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ వీరస్వామి గౌడ్, మాజీ సర్పంచ్ కిష్టయ్య, ఆకుల రాములు కుమారులు మల్లికార్జున్, ప్రభాకర్, నాయకులు పెంటేష్, చెన్నారెడ్డి, కృష్ణ పాల్గొన్నారు.

బాలుడు అదృశ్యం

పటాన్‌చెరు టౌన్: మైనర్ బాలుడు అదృశ్యమైన సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పటాన్‌చెరు మండల పరిధిలోని ఇంద్రేశం గ్రామానికి చెందిన బాలుడు(17) గత నెల 31న ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో బాలుడి కుటుంబ సభ్యులు ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో శుక్రవారం కుమారుడి అదృశ్యంపై తల్లి పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నిండు మనసుతో ఆశీర్వదించండి

- ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతా
- అన్నివర్గాల అభ్యున్నతికి కృషి
- బీఆర్‌ఎస్ అభ్యర్థి మహిపాల్‌రెడ్డి


ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డితో గౌడ సంఘం సభ్యులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ప్రజలు తనను నిండు మనసుతో ఆశీర్వదించి మరోసారి ఎమ్మెల్యేగా గెలిపిస్తే నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో మరింత అభివృద్ధి చేస్తానని బీఆర్‌ఎస్ అభ్యర్థి మహిపాల్‌రెడ్డి అన్నారు. తెల్లాపూర్‌లో కురుమ, విశ్వకర్మ సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో అన్ని సామాజిక కుల సంఘాలకు ఆత్మగౌరవ భవనాలు నిర్మించడంతో పాటు అనేక సంక్షేమ ఫలాలను అందించారని గుర్తు చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ లలిత, కౌన్సిలర్లు లచ్చిరాం నాయక్, శ్రీశైలంయాదవ్, నాగరాజు, జ్యోతి, బాలాజీ, కోఆప్షన్ సభ్యులు శ్రీపాల్‌రెడ్డి, తెల్లాపూర్ మున్సిపల్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు దేవేందర్‌యాదవ్, కురుమ సంఘం అధ్యక్షుడు మల్లేష్, విశ్వకర్మ సంఘం అధ్యక్షుడు శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

కాలనీవాసుల మద్దతు

పట్టణంలోని శ్రీనివాస్‌నగర్, మల్లికార్జుననగర్ కాలనీలతో పాటు శ్రీసాయినగర్‌లో ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా తాము బీఆర్‌ఎస్ వైపే ఉంటామని కాలనీవాసులు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. కార్యక్రమంలో మాజీ శాసనమండలి చైర్మన్ వెన్నవరం భూపాల్‌రెడ్డి, కార్పొరేటర్ పుష్ప, నాయకులు పాల్గొన్నారు.

ఎరుకల సంఘం నాయకుల సంపూర్ణ మద్దతు

పటాన్‌చెరు టౌన్: ఎమ్మెల్యే అభ్యర్థి మహిపాల్‌రెడ్డికి ఏకగ్రీవాల మద్దతు పరంపర కొనసాగుతోంది. పటాన్‌చెరు పట్టణంలో శుక్రవారం ఏర్పాటు చేసిన ఎరుకల సంఘం ఆత్మీయ సమ్మేళనంలో ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణ హాజరయ్యారు. ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాములు మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ఎరుకల సామాజికవర్గ సంక్షేమానికి పెద్దపీట వేయడంతో పాటు రాజకీయ పదవుల్లో సమన్యాయం పాటిస్తున్నారని తెలిపారు. మహిపాల్‌రెడ్డి విజయానికి ఏకగ్రీవంగా తమ మద్దతును ప్రకటిస్తున్నామన్నారు.

అభివృద్ధి పనులను వివరించండి

జిన్నారం(పటాన్‌చెరు): ప్రభుత్వం ప్రవేశపెట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి సూచించారు. బొల్లారం మున్సిపల్ కేంద్రంలో నూతనంగా నిర్మించిన బీఆర్‌ఎస్ భవనాన్ని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి తన సతీమణి యాదమ్మతో కలిసి శుక్రవారం ప్రారంభించారు. మూడోసారి బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయమన్నారు. అనంతరం ఎమ్మెల్యే దంపతులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కౌన్సిలర్‌లు చంద్రారెడ్డి, హన్మంత్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ బాల్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


డోలు కొడుతున్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

మైనార్టీల సంక్షేమానికి పెద్దపీట

పటాన్‌చెరు: మైనార్టీల సంక్షేమానికి తమ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. పటాన్‌చెరు మండల పరిధిలోని ఇస్నాపూర్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన మైనార్టీల ఆత్మీయ సమ్మేళనానికి ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి, శాసనమండలి మాజీ చైర్మన్ భూపాల్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మైనార్టీల ఆర్థికాభివృద్ధికి మొదటిసారిగా మైనార్టీ బంధు, లక్ష రూపాయల సాయం, రాష్ట్రవ్యాప్తంగా 200లకు పైగా మైనార్టీ గురుకులాలు ప్రారంభించి విద్యారంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కిందని కొనియాడారు. కార్యక్రమంలో ఇస్నాపూర్ మాజీ సర్పంచ్ వెంకట్‌రెడ్డి, సీనియర్ నాయకులు దశరథ్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, మెరాజ్‌ఖాన్, అబీద్ పాల్గొన్నారు.

సబ్బండ వర్గాల సంక్షేమమే లక్ష్యం

సీఎం కేసీఆర్ నాయకత్వంలో కులం, మతం, ప్రాంతం తేడా లేకుండా అన్నివర్గాల సంక్షేమం, ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నామని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. పటాన్‌చెరులో పద్మశాలి సంఘం, గౌడ సంక్షేమ సంఘం ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిపాల్‌రెడ్డి విజయానికి ఏకగ్రీవంగా సంపూర్ణ మద్దతును ప్రకటిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమాల్లో కార్పొరేటర్ కుమార్‌యాదవ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ను తరిమికొట్టాలి

పటాన్‌చెరు: అవినీతికి చిరునామాగా నిలిచిన కాంగ్రెస్ పార్టీని తరిమికొట్టి అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్న బీఆర్‌ఎస్‌కు ప్రజలు పట్టం కట్టాలని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి పిలుపునిచ్చారు. పటాన్‌చెరులో ఏర్పాటు చేసిన సమావేశంలో జిన్నారం మండలం మంగంపేట గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు రూపేరావు శ్రీనివాస్, సత్యనారాయణ, రాములు, శివకుమార్, మురళీదాసు, కృష్ణ, అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని ఇక్రిశాట్ కాలనీకి చెందిన ఎంఎం రెడ్డి, మహేందర్‌రెడ్డి, కృష్ణ, సీతారాంనాయక్, కిషోర్‌కుమార్, వరకుమార్, ప్రశాంత్‌రెడ్డి, రమేష్, నగేష్ ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు.


ఎరుకల సంఘం సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి


మహిపాల్‌రెడ్డి, భూపాల్‌రెడ్డిలను సన్మానిస్తున్న మైనార్టీ నేతలు


రాయికోడ్: ఎమ్మెల్యేకు గొర్రెపిల్లను అందజేస్తున్న సంఘం నాయకులు

గొల్ల, కురుమలకు అండగా ఉంటాం

ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్

రాయికోడ్(అందోల్): గొల్ల, కురుమలకు అండగా ఉంటామని ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ అన్నారు. నాగ్వార్ సమీపంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం నియోజకవర్గ గొల్ల, కురుమల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో బీఆర్‌ఎస్ గెలుపు కోసం ప్రతిఒక్కరూ సైనికులుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. అనంతరం ఎమ్మెల్యేను గొంగళితో సన్మానించి గొర్రెపిల్లను అందజేశారు. సమావేశంలో ట్రేడ్ కార్పొరేషన్ చైర్మన్ మఠం భిక్షపతి, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు జైపాల్‌రెడ్డి, జెడ్పీటీసీ మల్లికార్జున్ పాటిల్, మీనాక్షి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు బసవరాజ్ పాటిల్ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి

జోగిపేట(అందోల్): బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే అభ్యర్థి చంటి క్రాంతికిరణ్ అన్నారు. అందోల్ శివాలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ మఠం భిక్షపతి, అందోల్ ఎన్నికల ఇన్‌చార్జి ఫారుక్‌హుస్సేన్‌లతో కలిసి అందోల్‌లోని 5, 6, 7వ వార్డుల్లో ప్రచారం చేపట్టారు. కార్యక్రమంలో రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్ జగన్మోహన్‌రెడ్డి, ఆత్మగౌరవ కమిటీ అధ్యక్షుడు వీరభద్రరావు, అందోల్ – జోగిపేట మున్సిపల్ చైర్మన్ మల్లయ్య, వైస్‌చైర్మన్ ప్రవీణ్, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను గెలిపించే బాధ్యత మనదే

మునిపల్లి(అందోల్): బీఆర్‌ఎస్ అభ్యర్థి చంటి క్రాంతికిరణ్‌ను గెలిపించే బాధ్యత మనందరిపై ఉందని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షులు విజయ్‌కుమార్ అన్నారు. మండలంలోని బోడపల్లి గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఎంపీటీసీ మంద రాజశేఖర్, చాట్ల కృష్ణ, బస్వరాజ్, చంద్రయ్య, వీరన్న, శ్రీనివాస్, శంకర్, గోపాల్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ నేతల ముమ్మర ప్రచారం


చిమ్నాపూర్‌లో ప్రచారం నిర్వహిస్తున్న డీసీసీ అధ్యక్షురాలు నిర్మలాజయప్రకాశ్‌రెడ్డి

జిన్నారం(పటాన్‌చెరు): మండలంలోని కొర్లకుంట గ్రామంలో శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ రవీందర్‌గౌడ్, కాంగ్రెస్ మండల అధ్యక్షులు వడ్డె కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రాయికోడ్‌లో..

రాయికోడ్(అందోల్): కాంగ్రెస్ పాలనలోనే పేద ప్రజలకు లబ్ధి చేకూరిందని ఎమ్మెల్యే అభ్యర్థి దామోదర రాజనర్సింహా అన్నారు. మండలంలోని రాయిపల్లి, నాగన్‌పల్లి తదితర గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అంతకుముందు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ప్రచారాన్ని ప్రారంభించారు.

కాంగ్రెస్‌తోనే అన్నివర్గాల అభివృద్ధి

కంది(సంగారెడ్డి): కాంగ్రెస్‌తోనే అన్నివర్గాల అభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ జిల్లా అధ్యక్షురాలు నిర్మలాజయప్రకాశ్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని చిమ్నాపూర్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రఘుగౌడ్, పార్టీ మండల అధ్యక్షుడు మోతిలాల్ నాయక్, చిమ్నాపూర్ సర్పంచ్ ప్రమీలాప్రకాష్, నాయకులు బుజంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తనను రాజకీయంగా సమాధి చేశారు

సామాజిక ఉద్యమకారుడు ఢిల్లీ వసంత్


మాట్లాడుతున్న ఢిల్లీ వసంత్

జహీరాబాద్ టౌన్: వివిధ పార్టీల నాయకులు తనను రాజకీయంగా సమాధి చేశారని సామాజిక ఉద్యకారుడు, రైతు, బీజేపీ నాయకులు ఢిల్లీ వసంత్ అన్నారు. ఎమ్మెల్యే టిక్కెట్ ఆశించి భంగపడ్డ ఢిల్లీ వసంత్ పట్టణంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గతంలో మాజీ మంత్రి గీతారెడ్డి గెలుపు కోసం పనిచేస్తే ఆమె తనను రాజకీయ లబ్దికోసం వాడుకొని వదిలేసిందని వాపోయారు. తెలంగాణ నినాదాన్ని ఖండాతరాలు దాటించానని చెప్పారు. జీకాట్ సంస్థ ద్వారా కేసీఆర్‌ను తెలంగాణ జాతిపతి చేసిన ఘనత కూడా తనదేనని తెలిపారు. బీఆర్‌ఎస్‌ను ఉత్తర భారతదేశంలో విస్తరణకు ప్రయత్నం చేసిన తనను కేసీఆర్ కుటుంబం తనకు టికెట్ ఇవ్వకుండా అవమానించిందన్నారు. బీజేపీని వీడే ఆలోచన లేదని, చెరకు రైతుల కోసం పోరాటం చేస్తానని తెలిపారు. సమావేశంలో బీజేపీ నాయకులు పూల సంతోష్, విశ్వనాథ్‌యాదవ్, ఆశోక్ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరిక


సపానదేవ్‌కు పార్టీ కండువా కప్పుతున్న సీఎం కేసీఆర్

పటాన్‌చెరు టౌన్: ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్‌తో కలిసి పటాన్‌చెరు మాజీ కార్పొరేటర్, కాంగ్రెస్ సీనియర్ నేత సపానదేవ్ శుక్రవారం సీఎం కేసీఆర్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారికి సీఎం కేసీఆర్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

గ్యారంటీలను గడపగడపకు చేర్చండి

కాంగ్రెస్ అభ్యర్థి జగ్గారెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి జగ్గారెడ్డి

సదాశివపేట (సంగారెడ్డి): కాంగ్రెస్ మెనిఫెస్టోలోని ఆరు గ్యారంటీలను గడపగడపకు చేర్చాలని ఆ ఎమ్మెల్యే అభ్యర్థి జగ్గారెడ్డి పిలుపునిచ్చారు. సదాశివపేట పట్టణంలోని బాలాజీ ఫంక్షన్ హాలులో శుక్రవారం నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని, మరోసారి నమ్మి మోసపోవద్దని సూచించారు. తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే నియోజవర్గాన్ని అన్నిరంగాల్లో మరింత అభివృద్ధి చేస్తానని హామీనిచ్చారు. అనంతరం నిజాంపూర్ గ్రామానికి చెందిన బీజేపీ నాయకుడు, మాజీ ఎంపీటీసీ గంగయ్యతో పాటు పలువురు యువకులు కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాంరెడ్డి, పట్టణ, మండల అధ్యక్షుడు మునిపల్లి సత్యనారాయణ, సిద్దన్న, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ సైబర్ వలలో చిక్కి..

నగదు పోగొట్టుకున్న వ్యక్తి

పటాన్‌చెరు టౌన్: కారు కొనుగోలు చేసేందుకు ఆన్‌లైన్‌లో సైబర్ వలకు చిక్కి రూ.24,499 పోగొట్టుకున్న సంఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం లింగమయ్య కాలనీకి చెందిన ఓ వ్యక్తి ఈ ఏడాది మే 24న ఆన్‌లైన్‌లో కారును అమ్ముతామని పెట్టిన పోస్టును చూసి అపరిచిత వ్యక్తితో ఫోన్‌లో మాట్లాడి అపరిచిత వ్యక్తి చెప్పిన విధంగా పలు దఫాలుగా రూ.24,499 నగదు చెల్లించాడు. ఆ తర్వాత తనకు రావాల్సిన నగదు తిరిగి చెల్లించాలని బాధితుడు అడగడంతో అపరిచిత వ్యక్తి స్పందించలేదు. దీంతో తాను మోసపోయినట్లు గుర్తించిన బాధితుడు సైబర్ క్రైమ్, అమీన్‌పూర్ పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మళ్లీ బీఆర్‌ఎస్‌దే అధికారం

ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి


ప్రచారంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

కల్హేర్(నారాయణఖేడ్): వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయమని ఎమ్మెల్యే అభ్యర్థి భూపాల్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. సిర్గాపూర్ మండలంలోని పోచాపూర్, నల్లవాగు, బోక్కస్‌గాం, అంతర్‌గాం, ముబారక్‌పూర్, గరిడెగాం, పోట్‌పల్లి, తదితర చోట్ల శుక్రవారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ బలోపేతానికి మరింత కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ మహిపాల్‌రెడ్డి, జెడ్పీటీసీ రాఘవరెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ గుండు వెంకట్‌రాంలు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు సంజీవరావు, సర్పంచ్‌లు సత్యమ్మ, సంజీవరెడ్డి, సాయగౌడ్, బసిరెడ్డి, విజయ్‌కుమార్, బిరదర్ రవీందర్‌రావు, రవి పాటిల్, నాయకులు మాధవరావుపాటిల్, యాదవరావు పాల్గొన్నారు.

ప్రచారరథం ప్రారంభం

హత్నూర(సంగారెడ్డి): నర్సాపూర్ బీఆర్‌ఎస్ అభ్యర్థి సునీతాలక్ష్మారెడ్డి విజయం ఖాయమని ఆ పార్టీ మండల అధ్యక్షులు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండలంలోని దౌల్తాబాద్ పార్టీ కార్యాలయం వద్ద శుక్రవారం ప్రచార రథాన్ని ఎంపీపీ నర్సింలు, జెడ్పీటీసీ ఆంజనేయులుతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ దుర్గారెడ్డి, రైతు సమన్వయ సమితి మండల కోఆర్డినేటర్ బుచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'కాంగ్రెస్ విజయం ఖాయం'


రాయికోడ్: పార్టీలో చేరిన వారితో దామోదర రాజనర్సింహ, నాయకులు

కొండాపూర్(సంగారెడ్డి): మండల పరిధిలోని కోనాపూర్ గ్రామానికి చెందిన పలువురు గ్రామస్తులు ఎమ్మెల్యే జగ్గారెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం జగ్గారెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్‌తోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమన్నారు. కాంగ్రెస్ గెలుపు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, నర్సింహారెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెద్దాపూర్‌లో..

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): మండల పరిధిలోని పెద్దాపూర్ గ్రామానికి చెందిన మార్కెట్ కమిటీ డైరెక్టర్ కుమార్‌గౌడ్‌తో పాటుగా ఆయన అనుచరులు ఎమ్మెల్యే అభ్యర్థి జగ్గారెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గడీల రాంరెడ్డి, మండల అధ్యక్షుడు సిద్దన్న, నాయకులు దానగౌడ్, నరేందర్ పాల్గొన్నారు.

రాయికోడ్‌లో..

రాయికోడ్(అందోల్): రాయిపల్లి, సిరూర్, కుసునూర్ గ్రామాలకు చెందిన పలువురు ఎమ్మెల్యే అభ్యర్థి దామోదర ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో నాయకులు అంజయ్య, నర్సింలు, ప్రభాకర్, రవికుమార్, శ్రీనివాస్, సుభాష్‌పాటిల్, సతీష్‌కుమార్ పాల్గొన్నారు.

సదాశివపేటలో..

సదాశివపేట(సంగారెడ్డి): సదాశివపేట మాజీ మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ మంతురి అనిల్‌రెడ్డి తన అనుచరులతో కలిసి ఎమ్మెల్యే అభ్యర్థి జగ్గారెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాంరెడ్డి, పార్టీ పట్టణ అధ్యక్షుడు సత్యనారాయణ, నాయకులు పట్నం సుభాష్, రాయపాడ్ రమేష్, కలీల్, సాబేర్, అంజి, షెజ్జీ పాల్గొన్నారు.

బీజేపీ అధిష్టానం పునరాలోచించాలి


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే విజయపాల్‌రెడ్డి

నారాయణఖేడ్: ఖేడ్ బీజేపీ అభ్యర్థి విషయంలో అధిష్టానం పునరాలోచించాలని ఆ పార్టీ రాష్ట్ర నాయకులు, మాజీ ఎమ్మెల్యే విజయపాల్‌రెడ్డి కోరారు. ఈ నెల 6లోపు నిర్ణయం తీసుకోనిపక్షంలో కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేసి కార్యకర్తల అభీష్టం మేరకు తన భవిష్యత్తు నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. ఖేడ్‌లో శుక్రవారం పార్టీ ముఖ్య నాయకులు సమావేశం నిర్వహించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ నాయకులు, కార్యకర్తల అభిప్రాయాలు తీసుకుని అభ్యర్థిని ప్రకటించాల్సిన బాధ్యత పార్టీ అధిష్టానంపై ఉండగా అభ్యర్థి విషయంలో ఎలాంటి నిర్ణయం తీసుకుందో అర్థం కావడంలేదన్నారు. నాలుగేళ్లుగా పార్టీ కోసం నిరంతరం కృషిచేసినా న్యాయం జరగలేదని వాపోయారు. ఆ పార్టీ రాష్ట్ర నాయకులు మారుతిరెడ్డి, మండలాల అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.

'ఓటమికి భయపడే ఐటీ దాడులు'

జహీరాబాద్: నియోజకవర్గంలో ఓడిపోతామనే భయంతోనే ఎంపీపీ గిరిధర్‌రెడ్డి ఇంటిపై ప్రభుత్వం ఐటీ దాడులు చేయిస్తోందని కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. జహీరాబాద్‌లో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆ పార్టీ పార్లమెంట్ ఇన్‌చార్జి ఉజ్వల్‌రెడ్డి మాట్లాడుతూ జహీరాబాద్ స్థానాన్ని కాంగ్రెస్ భారీ మెజార్టీతో చేజిక్కించుకుంటుందనే భయంతోనే బీఆర్‌ఎస్, బీజేపీలు ఏకమై జహీరాబాద్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ కో ఆర్డినేటర్, ఎంపీపీ గిరిధర్‌రెడ్డికి చెందిన హైదరాబాద్‌లోని ఇంటిపై ఐటీ దాడులు చేయించారని విమర్శించారు. ఐటీ దాడులను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. సమావేశంలో బీసీ సెల్ నాయకులు భాస్కర్, నరేష్‌గౌడ్, ఎస్సీ సెల్ నాయకులు కండెం నర్సింహులు, గోపాల్, మైనార్టీ సెల్ నాయకులు మక్సూద్, అక్బర్ ఆయా మండలాల పార్టీ అధ్యక్షులు హన్మంత్‌రావుపాటిల్, నర్సింహారెడ్డి, రామలింగారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు గుండారెడ్డి, అశోక్, భాస్కర్‌రెడ్డి, మురళి కృష్ణాగౌడ్, నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

పండ్ల నాణ్యతపై అవగాహన

జహీరాబాద్: పండ్ల నాణ్యత మస్లిన్ విధానంపై అవగాహన శుక్రవారం మండలంలోని రంజోల్ గ్రామంలో డీడీఎస్–కేవీకే శాస్త్రవేత్త శైలజ ఉద్యాన కళాశాల విద్యార్థులకు, రైతులకు అవగాహన కల్పించారు. అరటి, బొప్పాయి, మామిడి, బత్తాయి, దానిమ్మ పండ్లను చల్లని గాలులు, ఎండ, చీడపురుగుల నుంచి రక్షించుకునేందుకు మస్లీన్ క్లాత్ తొడుగు వాడకంపై క్షేత్రస్థాయిలో ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో ఏఈఓ ప్రదీప్‌కుమార్, శ్రీనివాస్‌రెడ్డి, అరుణ్, మొయిజ్ పాల్గొన్నారు